రాష్ట్ర పౌరసఫరాల శాఖామంత్రిగా బాధ్యతలు చేపట్టిన కారుమూరి వెంకట నాగేశ్వరరావు

అమరావతి,14 ఏప్రిల్:ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాలు,వినియోగదారుల వ్యవహారాల శాఖామాత్యులుగా కారుమూరి వెంకట నాగేశ్వరరావు పదవీ బాధ్యతలు స్వీకరించారు. గురువారం అమరావతి సచివాలయం నాల్గవ బ్లాకులో ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం ఆయన మంత్రిగా బాధ్యతలు చేపట్టారు.మంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే 56 మంది జిల్లా వినియోగదారుల ఫోరమ్ అధ్యక్షులు,సభ్యులు,రాష్ట్ర వినియోగదారుల కమీషన్ సభ్యుల వేతనాలకు సంబంధించిన దస్త్రంపై తొలి సంతకం చేశారు.ఈసందర్భంగా ఆయన మట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్ జయంతి రోజున మంత్రిగా బాధ్యతలు చేపట్టడం చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు.తాను జిల్లా పరిషత్ అధ్యక్షునిగా,ఎంఎల్ఏగాను నేడు మంత్రిగా పనిచేసే అవకాశం కలిగిందంటే అది తన నియోజకవర్గ ప్రజలు,కార్యకర్తల కృషితోనే జరిగిందని అందుకు వారికి ఎల్లప్పుడూ ఋణపడి ఉంటానని మంత్రి నాగేశ్వరరావు చెప్పారు.

దేశంలో ఏరాష్ట్రంలో లేనివిధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పేదల సంక్షేమానికి అనేక పథకాలు,కార్యక్రమాలు అమలుచేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.136 బిసి కులాలకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వారి అభ్యున్నతికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎనలేని కృషి చేస్తున్నారని అన్నారు.ఇటీవల చేపట్టిన మంత్రివర్గ విస్తరణలో బిసి,ఎస్సి,ఎస్టి,మైనార్టీలకు అత్యంత ప్రాధాన్యతను ఇచ్చి 70 శాతం మంత్రి పదవులను ఇచ్చి అన్ని విధాలా గౌరవించారని చెప్పారు.ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పనిచేసి ముఖ్యమంత్రికి,ప్రభుత్వానికి మంచిపేరు తీసుకువచ్చేందుకు అన్ని విధాలా కృషి చేస్తానని మంత్రి నాగేశ్వరరావు స్పష్టం చేశారు.

అంతకు ముందు జిల్లా,రాష్ట్ర వినియోగదారుల ఫోరమ్ లో పనిచేస్తున్న జిల్లా అధ్యక్షులు,సభ్యులకు,రాష్ట్ర కమిషన్ లో పనిచేస్తున్న సభ్యులు మొత్తం 56 మందికి ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం జీతాలు చెల్లించేందుకు సంబంధించిన దస్త్రంపై మంత్రి నాగేశ్వర రావు తొలి సంతకం చేశారు.గతంలో వీరికి గౌరవ వేతనం ఇచ్చేవారని ఇకపై వారికి వేతనాలు ఇవ్వడం జరుగుతుందన్నారు.

అంతకు ముందు మంత్రివర్యుల చాంబరులో రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని అంబేద్కర్ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి ఘణంగా నివాళులర్పించారు.

ఈకార్యక్రమంలో రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఎండి వీరపాండ్యన్,ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

(ప్రచార విభాగం సమాచారశాఖ అమరావతి సచివాలయం వారిచే జారీ చేయడమైనది)